క్లుప్తంగా


గుట్కాలు విక్రయిస్తే చర్యలు



నేరేడుచర్లలోని పాన్ షాపును తనిఖీ చేస్తున్న ఎస్ఐ రవీందర్‌నాయక్

నేరేడుచర్ల : నిషేధిత గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్‌నాయక్ హెచ్చరించారు. మంగళవారం నేరేడుచర్లలోని పలు పాన్ షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిషేధిత గుట్కాలు, గంజాయి నివారణకు ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సన్మార్గంతో నడవాలని సూచించారు.

30, 31 తేదీల్లో తెలంగాణ గిరిజన సంఘం సదస్సు



కరపత్రం ఆవిష్కరిస్తున్న టీజీఎస్ నాయకులు

మఠంపల్లి : మండల కేంద్రంలో ఈనెల 30, 31 తేదీల్లో తెలంగాణ గిరిజన సంఘం (టీజీఎస్) సూర్యాపేట జిల్లా స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూక్యా పాండునాయక్, జిల్లా అధ్యక్షుడు మాళోతు బాలునాయక్‌లు తెలిపారు. మంగళవారం మఠంపల్లిలో వారు సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సదస్సుకు గిరిజనులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు స్వామినాయక్, రాము నాయక్, రాజు, వెంకటేశ్వర్లు, శంభయ్య, రాము తదితరులు ఉన్నారు.

21న వైద్యశిబిరం

హుజూర్‌నగర్ : పట్టణంలో ఈనెల 21వ తేదీన శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సమితి సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో చెవి, ముక్కు, గొంతు, తల, మెడ సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పశువుల యజమానులకు నోటీసులు అందజేత



మునగాలలో పశువుల యజమానులకు నోటీసులు అందజేస్తున్న ఎంపీఓ, తహసీల్దార్

మునగాల : ప్రస్తుత వర్షాకాలంలో గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం, కలుషిత నీటి మూలంగా విషజ్వరాలు ప్రబలుతుండడంతో మంగళవారం మునగాల గ్రామపంచాయతీ సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సర్వీసు రోడ్డు వెంట, వీధుల్లో పశువులను కట్టేసే వారికి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు, మండల పంచాయతీ అధికారి ఎస్.భూపాల్‌రెడ్డి నోటీసులు అందజేశారు. అదేవిధంగా ఇంటి ఆవరణ, వెలుపల పెంటదిబ్బలు, చెత్తకుప్పలు పోసే వారికి హెచ్చరికలు జారీ చేశారు. వీధుల్లో పెంటకుప్పలు పోయొద్దని, పశువులను కట్టివేయొద్దని హెచ్చరించారు. అనంతరం సర్వీస్ రోడ్డు వెంట ఉన్న అపరిశుభ్ర ప్రాంతాల్లో సిబ్బంది సాయంతో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీ మార్గదర్శకాలపై ప్రభుత్వం పునరాలోచించాలి

మునగాల: రైతు రుణమాఫీ మార్గదర్శకాలపై కాంగ్రెస్ ప్రభుత్వం పునరాలోచన చేయాలని మండలానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఎలాంటి ఆంక్షలు లేకుండా అర్హత గల ప్రతి రైతుకు రూ.రెండు లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీపై ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలతో అనేక మంది రైతులు నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

మునగాల : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.రెండు లక్షల లోపు రుణమాఫీ వర్తింపచేయాలని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు నాదెళ్ల గోపాల్‌రావు కోరారు. మంగళవారం మునగాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు నిబంధనలు పెట్టి కొందరికి రుణమాఫీ చేయకుండా తప్పించుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఎన్నికల హామీకి విరుద్ధంగా నియమాలు పెడితే గత ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ పార్టీకి పడుతుందని హెచ్చరించారు. రైతు భరోసాను త్వరగా రైతులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ మండల నాయకులు జంగిలి గోపి, మోహన్‌రావు పాల్గొన్నారు.

సరికొత్తగా సాగు.. లాభాలు బాగు

- డ్రమ్‌సీడర్, వెదజల్లే పద్ధతులపై రైతుల ఆసక్తి
- తగ్గుతున్న పెట్టుబడి, పంటకాలం
- ఆశాజనకంగా దిగుబడి



ఎకలాస్‌ఖాన్‌పేటలో డ్రమ్‌సీడర్ పద్ధతితో వరి విత్తనాలు విత్తుతున్న రైతు



సిరిపురంలో విత్తనాలు వెదజల్లుతున్న రైతు

నడిగూడెం : రైతులు వ్యవసాయంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆధునిక పద్ధతిలో సాగు చేపట్టి లాభాలు పొందుతున్నారు. వ్యవసాయానికి కూలీల కొరత రైతులను వేధిస్తుండడంతో రైతులు వరి సాగులో వెదజల్లే, డ్రమ్‌సీడర్ పద్ధతులకు మొగ్గు చూపుతున్నారు. దీంతో నారుమడి అవసరం ఉండకపోవడంతో పాటు పంటకాలాన్ని తగ్గించవచ్చని వారు చెబుతున్నారు. వరి సాగులో కూలీల కొరతను అధిగమించడానికి, పెట్టుబడి తగ్గించి అధిక దిగుబడి సాధించేందుకు నడిగూడెం మండలానికి చెందిన రైతులు ఈ పద్ధతులలో సాగు చేపడుతున్నారు.

14 వేల ఎకరాల్లో సాగు అంచనా..

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో మండలంలో దాదాపు 14 వేల ఎకరాలకు పైగా వరి సాగు చేసే అవకాశం ఉన్నది. ఇందులో దాదాపు 30 శాతం డ్రమ్‌సీడర్, 30 శాతం వెదజల్లే పద్ధతిలో పంట సాగు చేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు. డ్రమ్‌సీడర్‌ను రూ.4 నుంచి రూ.5 వేల వరకు వెచ్చించి రైతులు కొనుగోలు చేస్తున్నారు. డ్రమ్‌సీడర్‌తో విత్తనాలు వెదజల్లడంతో నిర్దిష్టమైన అంతరంలో సాళ్లు వస్తాయి. డ్రమ్‌సీడర్ విధానంతో 20 రోజుల ముందే పంట చేతికి వస్తుంది. 3 నుంచి 4 బస్తాల దిగుబడి అదనంగా వస్తుంది. వినూత్న పద్ధతిలో చేపడుతున్న సాగు విధానాలకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

ప్రభుత్వం రైతులకు డ్రమ్‌సీడర్లు ఇవ్వాలి



వరి సాగుకు కూలీల కొరతతో గతంలో ఇబ్బంది పడేవాళ్లం. పెట్టుబడులు కూడా అధికంగా పెరుగుతున్నాయి. దీంతో గత 15 ఏళ్లుగా 10 ఎకరాల కౌలుకు తీసుకుని వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేస్తున్నాం. పెట్టుబడులు తగ్గడంతో పాటు, దిగుబడులు కూడా పెరుగుతున్నాయి. మాలాంటి రైతులకు ప్రభుత్వం డ్రమ్‌సీడర్‌లు ఉచితంగా అందజేస్తే బాగుంటుంది.

– తాళ్లూరి వెంకటేశ్వర్లు, రైతు, సిరిపురం

సాగు చేపట్టడం సులువు



డ్రమ్ సీడర్, వెదజల్లే పద్ధతుల్లో సాగు రైతులకు చాలా సులువు. ఈ పద్ధతులతో కూలీల సమస్య, ఖర్చు తగ్గుతుంది. అన్నదాతలకు ఈ విధానాలపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఎకరానికి దాదాపు రూ.10 వేల వరకు ఖర్చు తగ్గుతుంది. దిగుబడి కూడా ఆశాజనకంగా వస్తుంది. ప్రతి రైతు ఈ పద్ధతుల్లో సాగు చేపట్టాలి.

– ఎం. రాజగోపాలరావు, వ్యవసాయాధికారి, నడిగూడెం

తాడువాయిలో కొనసాగుతున్న వైద్యసేవలు



వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులను పరామర్శిస్తున్న తహసీల్దార్

మునగాల : మండలంలోని తాడువాయిలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం కొనసాగుతోంది. మంగళవారం తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు వైద్యశిబిరాన్ని సందర్శించి జ్వరపీడితులను పరామర్శించారు. వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యసిబ్బందిని కోరారు. కాగా, మంగళవారం వైద్యశిబిరంలో 43 మంది తమ పేర్లు నమోదు చేసుకోగా ఐదుగురికి జ్వరం ఉన్నట్లు గుర్తించామని, ప్రస్తుతం 15 మంది జ్వరంతో బాధపడుతున్నారని, ఇద్దరికి గ్యాస్ట్రో ఎంటరైటీస్ ఉన్నట్లు గుర్తించినట్లు డాక్టర్లు వైష్ణవి, వినయ్‌కుమార్‌లు తెలిపారు. 21 మంది నుంచి రక్త నమూనాలు సేకరించామని, ముగ్గురికి డెంగీ వ్యాధి నిర్ధారణ అయినట్లు వారిని మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి పంపినట్లు తెలిపారు. శిబిరంలో రేపాల ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డా.శ్రీశైలం, పీహెచ్.ఎన్ శారద, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్లు లింగం రామకృష్ణ, లింగయ్య, ఏఎన్ఎంలు సంగెపు సుచరిత, మమత, నరసమ్మ, లలిత, ఆశా వర్కర్లు మరియమ్మ, మయూరి, నాగమణి, రమణ, మాణిక్యమ్మ పాల్గొన్నారు.

ముమ్మరంగా శానిటేషన్..

తాడువాయిలో మంగళవారం శానిటేషన్ పనులు ముమ్మరంగా చేసినట్లు మండల పంచాయతీ అధికారి ఎస్.భూపాల్‌రెడ్డి తెలిపారు. వీధులు, మురుగు కాలువల్లో దోమల మందు పిచికారీ చేశామని, వాటర్ ట్యాంకులో క్లోరినేషన్ చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో రేపాల పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శ్రీశైలం, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చిలుకూరు : ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ ప్రియాంక అన్నారు. మంగళవారం చిలుకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శానిటేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం ఆవరణలో గ్రామ పంచాయతీ, ఆరోగ్య సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ధర్మయ్యగౌడ్, జీపీ, ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామలక్ష్మీపురాన్ని సందర్శించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



మురుగు నీరు నిలిచిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాంచందర్‌రావు, ఎంపీఓ

కోదాడరూరల్ : మండలంలోని రామలక్ష్మీపురంలో డ్రెయినేజీ నీరు తమ వ్యవసాయ భూమిలోకి రాకుండా ఓ రైతు అడ్డుకట్ట వేయడంతో మురుగు నీరు కాల్వలో నిలిచి, రోడ్డుపై పారుతూ ప్రజలు ఇబ్బందులు పడుతుండడంపై మంగళవారం సాక్షిలో ప్రచురితమైన 'మురుగుమయం.. సీజనల్ భయం' అనే వార్తా కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం ఎంపీడీఓ రాంచందర్‌రావు, ఎంపీఓ పాండురంగన్నలు గ్రామానికి చేరుకొని మురుగు నీరు నిలుస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. సమస్య గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల్లో నీరు నిలవ్వలేకుండా చేస్తామని తెలిపారు. మరో రెండు వీధుల్లో కూడా డ్రెయినేజీ సమస్య ఉందని గ్రామస్తులు వారి దృష్టికి తీసుకెళ్లగా త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట కార్యదర్శి బాలరాజు, వైద్యసిబ్బంది, స్థానికులు ఉన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



వెలిదండలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

గరిడేపల్లి : అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు ఉంటుందని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం కార్యదర్శి మేకల నాగేశ్వరరావు అన్నారు. గరిడేపల్లి మండలంలోని వెలిదండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘ కాలం పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కేవీ సత్యనారాయణ, కళావతి, సువర్ణ, వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మయ్య, రవీందర్, చంద్రకళ, నాగలక్ష్మిలకు మంగళవారం పాఠశాలలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కనకయ్య చంద్రయ్య, పోటు రాజ్యం, మాజీ సర్పంచ్ మాశెట్టి అంజయ్య, పెండెం పుల్లయ్య, లక్ష్మి, గోవర్ధనరాజు, మోతీలాల్, నగేష్, సీవీ రావు, రంగయ్య, బుచ్చారావు, ఆంజనేయులు, ముజీబుర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

మునగాల : మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూర స్వరాజ్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మునగాల మండల కేంద్రంలో నిర్వహించిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు బిల్లులు రాక అప్పులు చేసి నెలల తరబడి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వంట చేసి పెడుతున్నారని, మార్కెట్‌లో గుడ్డు ధర రూ.7 ఉండగా ప్రభుత్వం ఇచ్చే ధర సరిపోక భోజన కార్మికులపై అదనపు భారం పడుతుందన్నారు. ప్రభుత్వమే పాఠశాలలకు గుడ్లు పంపిణీ చేయాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెనూ చార్జీలు పెంచాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు కిన్నెర సరోజన, ఎల్.స్వప్న, జి.ధనమ్మ, మనీ, రంగమ్మ, అరుణ, సరోజన, కోటమ్మ పాల్గొన్నారు.

మొహర్రం సందడి



రఘునాథపాలెంలో పీర్ల వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, భక్తులు



హుజూర్‌నగర్‌లో ప్రార్థనల్లో పాల్గొన్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్న

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెంలో మొహర్రం వేడుకలను మంగళవారం హిందూ ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాతగడ్డ పీర్ల చావిడిలో పీర్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మేళతాళాల నడుమ గ్రామంలో పీర్ల గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు సయ్యద్ నిజామ్, బొగ్గుల బాలసైదా, మహబూబ్, కేసనపల్లి హుస్సేన్, ముజావరి గార్లపాటి జలాలుద్దీన్, ముస్లింలు, హిందువులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్ : పట్టణంలో మొహర్రం పండుగ కొనసాగుతోంది. మంగళవారం చావిడి వద్ద పీర్లకు దట్టీలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముజావర్ సైదా మేస్త్రి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, గౌడ సంఘ అధ్యక్షుడు వల్లపుదాసు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుట్కా, పొగాకు ప్యాకెట్ల పట్టివేత

హుజూర్‌నగర్ : పాన్ షాపుపై పోలీసులు దాడి చేసి నిషేధిత గుట్కా, పొగాకు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల నల్లగొండ పాన్‌షాప్ యజమాని మునూరుద్దీన్ పట్టణానికి చెందిన అఖిల్ వద్ద తక్కువ ధరకు గుట్కా, పొగాకు ప్యాకెట్లు కొనుగోలు చేసి పక్కన గల నాగేందర్ టైలర్ షాప్‌లో కొంత, హ్యాపీ బట్టల దుకాణంలో మరికొంత దాచి అవసరం అన్న వారికి ఎక్కువ ధరకు అమ్ముతున్నాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఆయా షాపులపై దాడి చేసి సుమారు రూ.3 వేల విలువ గల నిషేధిత గుట్కా, పొగాకు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రీషెడ్యూల్ చేసిన రైతులకూ రుణమాఫీ వర్తింపజేయాలి

కోదాడరూరల్ : లోన్లు రీ షెడ్యూల్ చేసిన రైతులకు కూడా రైతు రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీపై ప్రభుత్వం విడుదల చేసిన నిబంధనలతో అనేక మంది రైతులు ఈ పథకానికి అనర్హులవుతారన్నారు. బ్యాంకర్ల ఒత్తిడితో కొందరు రైతులు రుణాలను రీషెడ్యూల్ చేశారని తెలిపారు. గత పదేళ్లుగా రాష్ట్రంలో నూతన రేషన్ కార్డులు మంజూరు కాలేదని, రేషన్ కార్డు నిబంధన ప్రకారం రుణమాఫీ చేయాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, పహాణీల ద్వారా పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ వర్తింపచేయాలని అన్నారు. పార్టీ పట్టణ కార్యదర్శి ముత్యాలు, దాసరి శ్రీనివాస్, కర్ణకోటి, నవీన్, మరియన్న, నాగరాజు, వెంకటేశ్వర్లు, భీమయ్య ఉన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలి



హుజూర్‌నగర్ : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, నాయకులు, తదితరులు



చిలుకూరులో ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీఓ గిరిబాబు, అంగన్‌వాడీ అధికారులు, సిబ్బంది

చిలుకూరు : చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని ఎంపీడీఓ గిరిబాబు అన్నారు. మంగళవారం చిలుకూరు మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అమ్మమాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునిత, గ్రామ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్, ధర్మయ్యగౌడ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కీతవారిగూడెంలో..

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెంలో గల అంగన్‌వాడీ -2లో మంగళవారం అమ్మమాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఎల్లావుల మల్లమ్మ, పంచాయతీ కార్యదర్శి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెంలో..

నడిగూడెం : మండల కేంద్రంలో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీ బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కొండలమ్మ, సవిత, కవిత, స్వర్ణ, శకుంతల, చిన్నారుల తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

నరసింహులగూడెంలో..

మునగాల : మండలంలోని నరసింహులగూడెంలో మంగళవారం అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ ఎం.సృజనారాణి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యను అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, అంగన్‌వాడీ చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్యాబోధన

హుజూర్‌నగర్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన అందుతుందని, రెండున్నర ఏళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కౌన్సిలర్లు కారింగుల విజయ, కె.శ్రీను, వి.సరితవీరారెడ్డిలు అన్నారు. అమ్మ మాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం హుజూర్‌నగర్ పరిధిలోని 1, 3, 5, 7,10, ముగ్ధుంనగర్, యర్రగట్టుల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో చిన్నారులు, స్థానికులతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలు, తల్లులు, ఆర్‌పీలు, సంఘ బంధం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మమాట– అంగన్‌వాడీ బాట ర్యాలీలు

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెం ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని కాల్వపల్లితండా, కొత్త దొనబండతండా, అల్లీపురం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో మంగళవారం అమ్మమాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీలు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ర్యాలీ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, పంచాయతీ కార్యదర్శులు రాజు, నాగిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు సంతోషికుమారి, రాజ్యలక్ష్మి, మంజుల, ఆశా వలంటీర్ లక్ష్మి, ఆయాలు సంక్రాంతి, కోటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

నేరేడుచర్ల : చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం నేరేడుచర్లలో నిర్వహించిన అమ్మ మాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సాయిరాం, వార్డు ఆఫీసర్ గోపినాథ్, అంగన్‌వాడీ టీచర్లు సరిత, ఉపేంద్ర, విజయ, పద్మ, ఈపీకే నాగలక్ష్మి, ఆశా కార్యకర్త గురువమ్మ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవాలి

హుజూర్‌నగర్‌రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హేమాదేవి అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ మండలంలో గల లింగగిరి సెక్టార్ పరిధిలోని వేలపసింగారం– 2, గోపాలపురం గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం తుమ్మల స్వరూపారాణి, సీసీ పరిమళ, చీకూరి లీలావతి, అంగన్‌వాడీ టీచర్లు సత్యావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌రూరల్ : ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు



నేరేడుచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



మఠంపల్లి : కాల్వపల్లితండాలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, తదితరులు



మునగాల : నరసింహులగూడెంలో..



నడిగూడెంలో..



గరిడేపల్లి : కీతవారిగూడెంలో..

కార్మికురాలికి నివాళి



రాధ మృతదేహానికి పూలమాలలు వేస్తున్న యరగాని నాగన్నగౌడ్ తదితరులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన మధ్యాహ్న భోజన కార్మికురాలు మాతంగి రాధ (40) డెంగీ జ్వరంతో రక్తకణాలు తగ్గి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు యరగాని భిక్షం, గడ్డం నాగయ్య, చింతకాయల రాము, చిమట సైదులు, గురవయ్య పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి మంగళవారం ఘనంగా ఆకుపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళశాసనం, ఆంజనేయస్వామికి పంచామృతాలు, 108 తమలపాకులతో అభిషేకం, ఆకుపూజ, గంధ సింధూరం, మన్యసూక్త పారాయణం, శ్రీరామ, ఆంజనేయ అష్టోత్తర శత నామావళి, అలంకరణ, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది కిరణ్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కొలువై ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన నిర్వాహకుడు దేవరశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ.. భక్తులకు 104 మంగళవారం సందర్భంగా అన్నదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దాతలు శ్రీనివాసరావు, నాగమణి, రమేష్, భార్గవి, లిఖిత్, రాజేష్, విజయశేఖర్, లక్ష్మి, దిలీప్ ఉన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో..

చిలుకూరు : మండల కేంద్రంలో కాలువ ఒడ్డున గల అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం మిట్స్ కళాశాల కరస్పాండెంట్, చైర్ పర్సన్ మధిర ప్రీతిరెడ్డి, వైస్ చైర్మన్ గౌతమ్‌రెడ్డిలు భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజారి రజనీకాంత్ ఆచార్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు, ఆలయ చైర్మన్ కొడారు వెంకటేశ్వర్లు, సభ్యులు, అధ్యాపకులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం



మునగాల : ఆయిల్ పామ్ మొక్క నాటుతున్న ఉద్యానవన అధికారి రవినాయక్



మఠంపల్లి : రఘునాథపాలెంలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న పీఏసీఎస్ చైర్మన్, రైతులు

మునగాల : ఆయిల్ పామ్ సాగు రైతులకు లాభదాయకమని ఉద్యానవన కోదాడ డివిజన్ అధికారి రవినాయక్, పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ యాదగిరి అన్నారు. మంగళవారం మునగాల మండలంలోని ఆకుపాముల శివారులో ఆయిల్ పామ్ మొక్కల మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పతాంజలి ఫుడ్స్ జిల్లా మేనేజర్ హరీష్, ఫీల్డ్ అసిస్టెంటు వెంకట్, మాజీ సర్పంచ్ కేసగాని వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మఠంపల్లి : ఆయిల్ పామ్ సాగు చేపట్టి అధిక లాభాలు పొందవచ్చని మఠంపల్లి మండల పీఏసీఎస్ చైర్మన్ జవ్వాజి రామచంద్రయ్య అన్నారు. మండలంలోని రఘునాథపాలెంలో రైతు జవ్వాజి శ్రీనివాస్‌యాదవ్ సాగు చేసిన ఆయిల్ పామ్ తోటలో ఉద్యానవన పట్టు పరిశ్రమ శాఖ సూర్యాపేట ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్‌లో ఆయన పాల్గొని మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సాయి, ఫీల్డ్ అసిస్టెంట్ బాలెబోయిన రవిగౌడ్, సయ్యద్‌నిజామ్, గురువారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, కంచు వెంకటసుబ్బయ్య, మాఖం నరసింహారావు, ముత్యాలంపాటి నాగుల్ మీరా, మాజీ ఎంపీటీసీ మేడి సామేలు, మాతంగి జోజి, రైతులు ఉన్నారు.